క్లుప్తంగా

విద్యార్థినికి అభినందనలు



పూర్ణిమను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

జి.సిగడాం: రణస్థలంలో ఈనెల 1వ తేదీన నిర్వహించిన జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్‌లో స్థానిక మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న పూర్ణిమ 4వ స్థానం కైవసం చేసుకుందని ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యూల్ లెంక తెలియజేశారు. ఈ మేరకు విద్యార్థిని రూ.7 వేల నగదు, ప్రశంసాపత్రం పొందింది. దీంతో విద్యార్థినిని పాఠశాలలో ఉపాధ్యాయులు పిచ్చిక నేతాజీ, నాగమణి తదితరులు సోమవారం అభినందించారు.

నిధులు విడుదలకు ఉత్తర్వులు



ఉత్తర్వులు చూపిస్తున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని డి.మత్స్యలేశం గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులకు గానూ గడప గడపకూ మన ప్రభుత్వం నిధులను విడుదల చేయాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎచ్చెర్ల ఎంపీపీ, హైకోర్టు న్యాయవాది మొదలవలస చిరంజీవి చెప్పారు. ఫరీదుపేటలోని ఆయన కార్యాలయంలో సోమవారం వివరాలు వెల్లడించారు. కాంట్రాక్టర్ అప్పుడు బోతు వెంకునాయుడు తరుపున కోర్టులో కేసు వేసినట్లు తెలిపారు. రెండు నెలల్లో బిల్లులు చెల్లించాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న దృశ్యం

జి.సిగడాం: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్ మోహన్ అన్నారు. మండలంలోని పెంట యూపీ పాఠశాలలో జీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పచ్చదనం- పరిశుభ్రత అందరి బాధ్యత అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

చివరి విడత శిక్షణ ప్రారంభం



శిక్షణ నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల సాంకేతిక శిక్షణ కేంద్రంలో జిల్లా వ్యవసాయశాఖ, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ కార్యకర్తల చివరి విడత శిక్షణ సోమవారం ప్రారంభమైంది. 100 మందికి రెండు బ్యాచ్‌లగా విభజించి శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు జిల్లా మేనేజర్ పి.రేవతి మాట్లాడుతూ జిల్లాలో 350 మంది ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు ఉన్నట్లు చెప్పారు. 240 మందికి శిక్షణ పూర్తి చేశామని, మరో 100 మందికి ప్రారంభించినట్లు చెప్పారు. రానున్న మూడేళ్లలో 80 శాతం రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం తగ్గించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఘన, ద్రవ జీవామృతం, సేంద్రీయ సాగు, కషాయాల తయారీ వంటి వాటిపై భవిష్యత్తులో లక్షమంది రైతులకు శిక్షణ ఇవ్వడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 365 రోజులు ఆదాయం ఇచ్చే పంటకు ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



ఆనందపురంలో అన్నదానం చేస్తున్న దృశ్యం

జి.సిగడాం: కార్తీకమాసం ముగింపు సందర్భంగా మెట్టవలస కొండ, ఆనందపురం, టీడీవలస, వెంకయ్యపేట, డీఆర్‌వలస, గెడ్డకంచరాం తదితర గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు సోమవారం నిర్వహించారు. సాయి, భవానీ, శివస్వాములు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదపండితుల సమక్షంలో పూజలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో పోలి పాడ్యమి



శ్రీకాకుళం కల్చరల్: నాగావళి తీరంలో ఆలయం వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కార్తీక మాసం పూర్తయిన సందర్భంగా సోమవారం పోలి పాడ్యమి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల్లో వేకువజాము నుంచి భక్తుల రద్దీ కనిపించింది. పలుచోట్ల అన్న సమారాధనలు ఏర్పాటు చేశారు. – సాక్షి నెట్‌వర్క్




జి.సిగడాంలో దీపారాధన చేస్తున్న మహిళలు



శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలో ముత్యాలమ్మ తల్లికి దీపారాధనలు



రణస్థలం: గిరివానిపాలేం వేంకటేశ్వర ఆలయంలో అన్నదానం



శ్రీకాకుళం కల్చరల్: పండ్లతో ఉమాజఠలేశ్వరుని అలంకరణ

కూరగాయల సాగు..

ఆదాయం బాగు



నేరుగా కూరగాయలు అమ్ముతున్న రైతులు



ఇతర ప్రాంతాలకు రవాణాకు సిద్ధంగా ఉంచిన దొండ పంట

- కూరగాయాల సాగులో రాణిస్తున్న రైతులు
- నేరుగా విక్రయిస్తూ ఆదాయం
- ఇతర ప్రాంతాలకు సైతం ఎగుమతి

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలో పలు గ్రామాలకు చెందిన రైతులు కూరగాయాల సాగుకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. ప్రధానంగా ఫరీదుపేట, కేశవరావుపేట, ఎస్ఎంపురం, ఎచ్చెర్ల, చిలకపాలేం, మెట్టపేట, తమ్మినాయుడుపేట, కొత్తపేట ప్రాంతాల్లో సుమారుగా ఐదువేల ఎకరాల్లో కూరగాయాలు సాగు చేస్తున్నారు. దొండ, బెండ, కాకర, బీర, వంగ, మిరప, చిక్కుడు, టమాటా, కాలీఫ్లవర్, క్యాబేజీ బుట్ట వంటివి సీజనల్‌గా సాగు చేస్తున్నారు.

శ్రీకాకుళంలో అమ్మకాలు

సాగు చేస్తున్న కూరగాయలు శ్రీకాకుళం పట్టణంలోని రైతు బజార్, ముత్యాలమ్మ మార్కెట్, పొట్టి శ్రీరాములు మార్కెట్ వంటి చోట్ల అమ్మకం చేస్తున్నారు. కొందరు మధ్యవర్తులకు అమ్మడం చేస్తుండగా, కొందరు రైతులు నేరుగా అమ్మకం చేస్తున్నారు. ప్రస్తుతం అన్ని రకాల కూరగాయలకు మంచి డిమాండ్ ఉండడంతో, రైతులకు సైతం మంచి ఆదాయం వస్తోంది. మరో పక్క రైతులు సేంద్రీయ పద్ధతుల్లో సాగుకు ప్రాధాన్యతనిస్తున్నారు. నేరుగా వినియోగదారులకు అమ్మేందుకు సైతం ప్రాధాన్యమిస్తున్నారు. జాతీయ రహదారిపై నవభారత్, కింతలి మిల్లు, చిలకపాలేం వంటి ప్రాంతాల్లో హోల్ సేల్ వ్యాపారులు రైతుల నుంచి కొన్న కూరగాయలు తెలంగాణా, ఒడిశా రాష్ట్రాలకు రవాణా చేస్తున్నారు. విశాఖపట్నం, విజయవాడ ఇతర పట్టణ ప్రాంతాలకు సైతం రవాణా చేసి అక్కడ అమ్మకం చేస్తున్నారు.

నిరంతరం ఆదాయం



కూరగాయల సాగుతో నిరంతరం ఆదాయం వస్తుంది. అంతర పంటలు, గట్లపై బంతి సాగు వంటివి చేస్తున్నాం. ఆకుకూరలు సాగు సైతం చేపడుతున్నాను. దీంతో మెరుగైన ఆదాయం వస్తోంది. కొన్నిసార్లు మధ్యవర్తులకు అమ్మడం, ఖాళీగా ఉంటే నేరుగా వినియోగదారులకు అమ్మడం చేస్తున్నాం. ఎకరాలో పలు రకాల కూరగాయలు సాగు చేస్తున్నాను.

– సువ్వారి సన్యాసిరావు, రైతు, ఎచ్చెర్ల

అలవాటుగా మారింది



ప్రస్తుతం మాకు కూరగాయల సాగు అలవాటుగా మారింది. నేను ప్రకృతి వ్యవసాయ కార్తకర్తగా సైతం పనిచేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్నాను. పంట దిగుబడి ఆధారంగా ఆదాయం వస్తోంది. కుటుంబ పోషణకు ఇబ్బంది లేకుండా ముందుకు సాగుతున్నాం. ఎకరా పొలంలో కూరగాయలు సాగు చేస్తున్నాం.

– చంద్రకళ, మహిళా రైతు, కేశవరావుపేట

వైవిధ్యంగా సాగు

ఎచ్చెర్ల మండలంలో వ్యవసాయ మోటార్లు ఆధారంగా వైవిధ్యంగా సాగు చేస్తున్నారు. సీజనల్ క్యాలెండర్ పాటిస్తున్నారు. టమాటా, బీన్స్, కాలీఫ్లవర్ వంటి పంటలు సీజనల్‌గా సాగు చేస్తున్నారు. దీంతో పాటు దొండ, మిరప, వంగ వంటి పంటకు ప్రాధాన్యమిస్తున్నారు. అంతర పంటలుగా తీగ జాతి పంటలు చిక్కుడు, కాకర, బీర సాగు చేస్తున్నారు.

– సురేష్, వ్యవసాయ అధికారి

అసంపూర్తిగా భవనం



ఎచ్చెర్ల గ్రామ సచివాలయ భవనం అసంపూర్తిగా మిగిలిపోయింది. దీంతో ప్రస్తుతం భవనం పాడవుతోంది. అందువలన భవనం పూర్తి చేయాలని అధికారుల దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. పాత భవనంలో అరకొర వసతులతో సిబ్బంది పాట్లు పడుతున్నారు.

- ఎచ్చెర్ల క్యాంపస్

సేంద్రీయ కూరగాయల విక్రయం



జి.సిగడాం తహసీల్దార్ కార్యాలయం అవరణలో సోమవారం ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలను విక్రయంచారు. జగన్నాథవలస, సర్వేశ్వరపురం, జి.సిగడాం గ్రామాల్లో సేంద్రీయ ఎరువులతో పండించిన కూరగాయాలను తీసుకొచ్చి గ్రీవెన్స్‌కు వచ్చిన ప్రజలకు విక్రయించారు. ప్రకృతి వ్యవసాయంతో తక్కువ పెట్టుబడితో ఆరోగ్యకరమైన పంటలు పండివచ్చన్నారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్‌లు సంతోషి, రాజేష్, శివ, రాజేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

- జి.సిగడాం

ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు



శ్రీకాకుళం నగరంలోని కొత్త రోడ్డు కన్వెన్షన్ హాల్‌లో పీస్ అండ్ రిజాయిస్ గాస్పెల్ మినిస్ట్రీ పాస్టర్ చల్లా కరుణాకర్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. బిషప్ సామ్యూల్ పట్టా దేవుని సందేశాన్ని అందించారు. అనంతరం క్యాండిల్ లైట్ సర్వీసు నిర్వహించారు. కార్యక్రమంలో క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

-శ్రీకాకుళం కల్చరల్

చట్టాల్లో మార్పులు అనివార్యం



మాట్లాడుతున్న సూర్యప్రకాషరావు

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రస్తుత కాలానుగుణంగా చట్టాల్లో మార్పులు అనివార్యమని విశాఖపట్నంకు చెందిన దామోదర సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్, విశ్రాంత ఆంధ్రా విశ్వవిద్యాలయం న్యాయ విభాగం ప్రొఫెసర్ డి.సూర్యప్రకాషరావు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో రీసెర్చ్ ఫోరం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన క్రిమినల్ జస్టిస్ లా అండ్ రీసెంట్ ట్రెండ్స్ అన్న అంశంపై మాట్లాడారు. భారత రాజ్యాంగంలో వస్తున్న సవరణలు మాదిరిగా సమాజ శ్రేయస్సు, భద్రతకు చెందిన న్యాయ చట్టాల్లో సైతం మార్పులు, సవరణలు అవసరమన్నారు. బ్రిటీష్ చట్టాలకు మార్పులు చేసి భారత పార్లమెంట్ ఇటీవల ఆమోదం తెలిపిందన్నారు. ఐపీసీ 1860, 1973, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872లకు బదులుగా కొత్త చట్టాలు అమల్లోకి వచ్చాయని చెప్పారు. ఉగ్రవాదం, దేశ సరిహద్దు వంటి సమస్యలపై మెరుగైన సవరణలు చేశారన్నారు. చిన్న చిన్న నేరాలకు సామాజిక సేవ శిక్షగా అమలు చేయడం మంచి పరిణామంగా వివరించారు. సెక్యూలరిజం, సోషలియం అంశాలకు ప్రాధాన్యత పెరిగిందన్నారు. ఆర్టికల్స్ 20, 21, 22 ప్రాధాన్యత ఉందని, 41(ఎ) తక్కువ శిక్షకు పోలీస్ స్టేషన్‌లోనే బెయిల్ పొందవచ్చునని వెల్లడించారు. కార్యక్రమంలో వీసీ కె.ఆర్.రజిని, రెక్టార్ అడ్డయ్య, రిజిస్ట్రార్ సుజాత, ప్రిన్సిపాల్ అనురాధ, న్యాయ విభాగం కో–ఆర్డినేటర్ వై.రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విజయబావుటా ఎగుర వేయాలి



పూజితను అభినందిస్తున్న బలభద్రుని రాజా తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్–2024 పోటీలకు జిల్లాకి చెందిన క్రీడాకారిణి బొట్ట పూజిత ఎంపికైంది. ఈ పోటీలు ఈనెల 17 నుంచి 21వ తేదీ వరకు బీహార్‌లోని పాట్నా వేదికగా జరగనున్నాయి. ఇటీవల నంద్యాలలో జరిగిన 68వ ఏపీ స్కూల్‌గేమ్స్ ఫెన్సింగ్ పోటీల్లో అండర్–19 విభాగంలోని ఇప్పి కేటగిరిలో పతకంతో రాణించడంతో జాతీయ పోటీలకు ఎంపికైంది. రణస్థలం మండలం కోటపాలెం గ్రామానికి చెందిన పూజిత అక్కడి స్థానికంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. పోటీల కోసం కఠోర సాధన చేస్తోంది. జాతీయ పోటీలకు ఎంపికైన సందర్భంగా సోమవారం శ్రీకాకుళంలో జరిగిన అభినందన కార్యక్రమంలో జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని రాజా క్రీడాకారిణిని అభినందించారు. జాతీయ పోటీల్లో విజేతగా నిలిచి పతకంతో జిల్లాకు తిరిగిరావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫెన్సింగ్ కోచ్ వంశీతో పాటు పీడీ, పీఈటీలు డి.భవానీ, భాగ్యలక్ష్మి, యశోద, అనిత, రాములమ్మ, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజంలో మేము సైతం

- పోస్టర్ రూపొందించిన ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఫ్యాన్స్
- ఈనెల 4న అవగాహన బైక్ ర్యాలీ

శ్రీకాకుళం అర్బన్: డ్రగ్స్ రహిత సమాజం కోసం తాము సైతం కృషి చేస్తామని ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఫ్యాన్స్ ముందుకొచ్చారు. ఈ మేరకు ఆలిండియా అల్లు అర్జున్ ఫ్యాన్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డ్రగ్స్ రహిత సమాజం కోసం రూపొందించిన ప్రత్యేక పోస్టర్లను, శ్రీకాకుళం నగరంలోని సరస్వతీ మహల్ ఆవరణలో థియేటర్ మేనేజర్ చిన్న రాజు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అఖిల భారత చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ తైక్వాండో శ్రీను మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజం కోసం యువతకి అవగాహన కలిగించే ఉద్దేశంతో ఈనెల 4వ తేదీన శ్రీకాకుళం నగరంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ర్యాలీని అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి దేవాలయం కూడలి వద్ద ప్రారంభించి పసగాడ సూర్యనారాయణ మిల్లు కూడలి, సూర్య మహల్, రామలక్ష్మణ కూడలి మీదుగా సరస్వతీ మహల్ థియేటర్ వరకు చేపట్టనున్నట్లు తెలియజేశారు. అల్లు అర్జున్ అభిమానులతో పాటు మెగా ఫ్యామిలీ అభిమానులు పెద్ద ఎత్తున ఈ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంక్ మేనేజర్ టి.మణికంఠ, రాగోలు నాగశివ, ఆలిండియా అల్లు అర్జున్ ఫ్యాన్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ శ్రీకాకుళం జిల్లా శాఖ తైక్వాండో నవీన్, ప్రతినిధులు తాలాడ శేఖర్, భాను, కెల్ల గిరి, పవన్ కల్యాణ్ అభిమాన సంఘ ప్రతినిధులు గొర్లె కిరణ్, పెయ్యిల చంటి, మోహన్, సాయిదుర్గ తేజ్ అభిమాన సంఘం అధ్యక్షుడు జోగిపాటి వంశీ, వరుణ్ తేజ్ అభిమాన సంఘం అధ్యక్షుడు శీర రాజు తదితరులు పాల్గొన్నారు.

అక్షర వెలుగు పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అధికారులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికలో అక్షర వెలుగు పుస్తకాన్ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, డీఈఓ తిరుమల చైతన్య, ఇతర జిల్లా అధికారులు సోమవారం ఆవిష్కరించారు.

పరామర్శ



కౌశిక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్ తదితరులు

రణస్థలం: విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లి వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో గవిడి కౌశిక్‌తో పాటు మరో ముగ్గురు మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో కౌశిక్ కుటుంబ సభ్యులను శ్రీకాకుళంలోని వారి స్వగృహంలో ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సోమవారం పరామర్శించారు. ఆయనతో పాటు వైస్ ఎంపీపీ ప్రతినిధి మైలపల్లి కామరాజు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రెడ్డి విశ్వేశ్వరరావు, కొండములగాం, మహంతిపాలెం సర్పంచ్‌లు గొర్లె అప్పలనాయుడు, అప్పలనర్సునాయుడు, నాయకులు కురిటి రామకోటి, లంక బాబాజీ నాయుడు, గొర్లె శ్రీనివాసరావు, రవి, కెల్ల రమణ, మంత్రి శ్రీనివాసరావులు ఉన్నారు.

సంక్షిప్తంగా..

నాటికకు ప్రశంసలు



బహుమతులు అందుకుంటున్న నటులు

శ్రీకాకుళం కల్చరల్: బిలాయ్‌లో ప్రవాసాంధ్రుల లలితశ్రీ నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన నాటిక పోటీల్లో శ్రీకాకుళం లలితశ్రీ కళాసమితి ఆదివారం ప్రదర్శించిన 'మతమా.. మానవత్వమా' నాటికకు పలు బహుమతులు వచ్చాయి. ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా, ఉత్తమ ద్వితీయ దర్శకుడిగా ఎల్.రామలింగస్వామి, ఉత్తమ నటిగా కేశిరెడ్డి రాజేశ్వరి, ఉత్తమ సంగీతం పి.లీలామోహన్‌లు బహుమతులు అందుకున్నారు.

ప్రీ లోక్ అదాలత్



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ సన్యాసినాయుడు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలోని న్యాయసేవా సదన్‌లో ప్రీ లోక్ అదాలత్‌ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌కి సంబంధించి 3 కేసులు, నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌కు సంబంధించి 10 కేసులు, టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీకి సంబంధించి 6 కేసులు రాజీ అయ్యాయని తెలిపారు. ప్రీ లోక్ ఆదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



నృత్య ప్రదర్శనలు చేస్తున్న చిన్నారులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బలగ ఉత్తరేశ్వర స్వామి ఆలయం వద్ద పోలి పాడ్యమిని పురస్కరించుకొని నృత్య ప్రదర్శనలు సోమవారం జరిగాయి. ఆలయ అర్చకులు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ నృత్య ప్రదర్శనలో సత్యసాయి నృత్య నికేతన్ నృత్య దర్శకురాలు ఎస్.పి.కవిత ఆధ్వర్యంలో చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

నిత్యావసర సరుకులు పంపిణీ

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు వప్పంగి గ్రామంలో నివాసముంటున్న గొంటి తాతారావు యాదవ్ కుటుంబానికి నిత్యావసర సరుకులు సోమవారం అందించారు. అరసవల్లి గోశాలలో రోజువారీ కూలీగా పనిచేస్తున్న గొండి తాతారావు ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రి పాలయ్యాడు. దీంతో షన్ముఖరావు అనే వ్యక్తి ద్వారా విషయం తెలుసుకున్న ఎమెర్జెన్సీ బ్లడ్ సర్వీస్ ప్రతినిధి నంది ఉమాశంకర్ తన వాట్సాప్ గ్రూపు ద్వారా సాయం అందించారు. కార్యక్రమంలో బొట్ట సాయికుమార్, ఉర్లం శివతేజ, పూర్వ విద్యార్థులు కొల్లి శివకుమార్, అరజంగి తిరుమలరావు, కరణము షన్ముఖరావు, మిత్రబృందం తదితరులు పాల్గొన్నారు.